జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం, ఆగస్టు 1, 2026 పేజీలు :7





## మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వ పథకాలే అండ

– ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్ ఆదర్శ్ సురభి





# ఎరువు.. బరువు

ఒక్కసారిగా ధరలకు రెక్కలు

కృత్రిమ కొరత సృష్టించి అమ్మకాలు

యూప్ బుకింగ్‌లోనూ రైతులకు తప్పని సమస్యలు

వర్షాలు లేక ఒకవైపు, ఎరువులు దొరక్క మరోవైపు



**మహబూబ్‌నగర్ ప్రజాజ్యోతి**

ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఎరువుల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ధరలు పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు యూరియా, సాగు చేయాల్సిన పంటలకు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఉంది. జిల్లాలో వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో ఇప్పటి వరకు సగం మాత్రమే సాగు చేశారు. వర్షాలు కురిస్తే మిగతా పంటలు సాగు చేయాలని రైతులు ఎదురుచూస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు, ఎరువుల తయారీకి అవసరమైన ముడిపదార్థాల దిగుమతి ఖర్చులు పెరగడం, సరఫరా నిలిపిపోయిందని సాకులు చెప్పి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో పలుచోట్ల డీఏపీ, యూరియా నిల్వలు లేక రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**యూప్ బుకింగ్‌తోనూ తిప్పలే..**

రైతులకు ఎరువులు కావాలంటే ముందు యాప్‌లో నమోదు చేసుకోవాలి. అలా అయితేనే ఎరువులు దొరుకుతున్న పరిస్థితి. ఇందులోనూ రాజకీయ నేతల ప్రభావం ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు పలుకుబడి ఉన్న నేతలు చెప్పిన విధంగా నడుచుకోవడంతో అసలు రైతులు అవస్థలు పడుతున్నారు. రాజకీయ నాయకులు చెప్పిన సమయానికి యాప్‌లో నిల్వలు ఉంచి వారు బుకింగ్ చేసుకున్న తర్వాత మూసేస్తున్నారు. అప్పటికే

## వారం రోజుల్లో రూ.40 కోట్ల రోడ్డు పనులకు శ్రీకారం

- పెద్దమందడి--వనపర్తి రోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్
- ఇందిరమ్మ ఇళ్లలో జాప్యం వద్దు
- ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం సహించం
- మహిళా సంఘాల రుణాల జాప్యంపై ఏపీఎంపై ఎమ్మెల్యే ఆగ్రహం



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను వెంటనే పంపించాలి

- గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలి
- అర్హుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలి,
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



## వారం రోజుల్లో రూ.40 కోట్ల రోడ్డు పనులకు శ్రీకారం

వనపర్తి ప్రతినిధి, జూలై 31 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. ప్రతి శాఖ ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శుక్రవారం పెద్దమందడి రైతువేదికలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పెద్దమందడి--వనపర్తి ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.40 కోట్లు మంజూరైనా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల మధ్య సాంకేతిక సమస్యల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యాయని, మరో వారం రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు మట్టి, ఇసుక సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల రుణాల మంజూరులో జాప్యంపై ఏపీఎంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో యూరియా బుకింగ్ యాప్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గంలో గత 30 నెలల్లో విద్యుత్ శాఖ ద్వారా రూ.140 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రస్తుతం మరో రూ.40 కోట్ల పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయాలని, నిర్లక్ష్యం వహించే గ్రామపంచాయతీలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యా రంగంలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొస్తోందని, వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మూడు నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధరణి సమస్యలకు భూభారతి ద్వారా దశలవారీగా పరిష్కారం చూపుతున్నామని, అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వారం రోజుల్లో పంపిణీ ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో మార్కెట్ యార్డు అధ్యక్షురాలు నవనీత, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి విజయభాస్కర్, జడ్పీ సీఈవో యాదయ్య, ఎంపీడీవో పరిణత, ఎంఈఓ మంజుల, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలను వెంటనే పంపించాలి



నాగర్ కర్నూల్ జులై 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యాలను సకాలంలో సాధించాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.

శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఇన్చార్జి పిడి హౌసింగ్ గోపాల్ నాయక్ లతో కలిసి హౌసింగ్ ఏఈలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత లబ్ధిదారుల వివరాల ఎంపిక తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,....... రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పథకం అమలులో పారదర్శకత, వేగం, సమర్థతకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసి, అర్హుల పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా జిల్లా కేంద్రానికి పంపించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలను ముమ్మరం చేయాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అందిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసి అర్హుల తుది జాబితాలను సిద్ధం చేసి వెంటనే జిల్లా కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు.

గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలు, గృహరహిత కుటుంబాలు, అత్యంత వెనుకబడిన వర్గాలకు చెందిన అర్హులను ప్రత్యేకంగా గుర్తించి, వారికి రెండో విడతలో ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలను పంపించడంలో ఎలాంటి జాప్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు. మండలాల వారీగా అర్హుల జాబితాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, అవసరమైన అన్ని వివరాలతో వెంటనే జిల్లా కేంద్రానికి సమర్పించాలని సూచించారు.

సమాచారం పంపడంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరిగితే పథకం అమలు కూడా జాప్యానికి గురయ్యే అవకాశం ఉంటుందని, ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ అర్హుల ఎంపికలో పూర్తి పారదర్శకతను కొనసాగించాలని తెలిపారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ అనర్హులు జాబితాలో చోటు దక్కకుండా, అదే సమయంలో నిజమైన అర్హులు ఒక్కరూ మినహాయింపుకు గురికాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టాలని ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపించి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, పథకం అమలులో నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనమే విజయానికి మూలమని, ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారిగా పనిచేయాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో డిపిఓ శ్రీరాములు, హౌసింగ్ ఏఈ లు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువు.. బరువు

ఆయా దుకాణాలకు కేటాయించిన ఎరువులు ఖాళీ అయిపోతున్నాయి. రైతులు బుక్ చేసుకుందానే లోపే నిమిషాల వ్యవధిలో ఖాళీ కావడంతో ఎరువుల కోసం నానా అవస్థలు పడుతున్నారు.

పెరుగుతున్న వినియోగం

సాగులో ఎరువుల వినియోగం ఏటేటా పెరుగుతోంది. ఎరువు బస్తా లేనిదే పంటలు పండవన్న భావనలో రైతులు ఉంటున్నా రు. ఎకరాకు గతేడాది మూడు బస్తాలు వేస్తే, ఈ సారి నాలుగు బస్తాలకు పెంచుతున్నారు. వానాకాలం ప్రారంభంలో కురిసిన వానలకు రైతులు పత్తి, కంది, మొక్కజొన్నఇతర పంటలు సాగు చేశారు. తడిలేక మొలకలు ఎండిపోతున్నాయి. పంటలపై యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేయాలని అధికారులే సూచిస్తున్నారు. అయితే మార్కెట్‌లో యూరియా దొరకని పరిస్థితి. కాంప్లెక్స్ ధరలు అధికంగా ఉండడంతో యూరియాపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఒక్క బస్తా అవసరం ఉన్నచోట రెండు బస్తాలను వినియోగిస్తున్నారు. దీంతో యూరియా కొరత ఏర్పడుతోంది. రవాణా జాప్యం వల్ల కూడా కొంత సమస్యకు దారి తీస్తోందని చెబుతున్నారు.

## ఉప్పునుంతల ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికతనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి కృష్ణ.

### విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఆస్పత్రి డాక్టర్లకు, సిబ్బందికి సూచన.



ఉప్పునుంతల, జూలై 30 : ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి కృష్ణ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలను నిర్వహణపై సిబ్బందితో ఆరా తీశారు. రోజువారీగా వచ్చే బయటి రోగుల వివరాలు, ఇన్ పేషెంట్ల సంఖ్య ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలను ఆసుపత్రి వైద్యాధికారిని స్వప్నను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సాధారణ కాన్పుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, తదితర రికార్డులను పరిశీలించారు. వర్షాకాల పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వీధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలు వైద్యాధికారిని స్వప్న, డాక్టర్ బిక్కు నాయక్, డాక్టర్ శంకర్ తదితర సిబ్బంది ఉన్నారు

## ఖాళీ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

అమ్రాబాద్, జూలై 31

గిరిజన గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల మన్ననూర్ లో మిగులు సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సాయిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరం లో భాగంగా గిరిజన గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల పి టి జి మన్ననూర్ నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అందులో సీఈసీ -- 15 సీట్లుహెచ్ ఈ సి -- 30 సీట్లుఅన్ని కులాల విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు తమ పదవ తరగతి మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ , స్టడీ సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం , ఆధార్ కార్డు మరియు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలుతో కళాశాలలో సంప్రదించి ప్రవేశం పొందాలని పేర్కొన్నారు .

## మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వ పథకాలే అండ

**వనపర్తి, జూలై 31 (ప్రజాజ్యోతి):**
మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన కింద మదనాపూర్ మండలం కొన్నూరు తాండాకు చెందిన గోవిందమ్మకు సబ్సిడీపై మంజూరైన మారుతి ఈకో వాహనాన్ని శుక్రవారం ప్రారంభించి తాళాలు అందజేశారు. రూ.6.80 లక్షల విలువైన వాహనానికి కేవలం ఒక శాతం వడ్డీతో రూ.6.30 లక్షల రుణ సదుపాయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రెండు నెలలుగా జీతాలు లేక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన



**గద్వాల,జూలై 31(ప్రజా జ్యోతి)**

:గ్రామ పంచాయతీల్లో గత 20 సంవత్సరాలుగా ఫీల్డ్ టెక్నికల్ ఎంప్లాయిస్ (ఫీల్డ్ అసిస్టెంట్లు)గా విధులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి హామీ కూలీల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెన్‌డౌన్ నిర్వహించి, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పంచాయతీ స్థాయి సాంకేతిక పనులు,అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు పెన్‌డౌన్,షట్‌డౌన్ కారణంగా గత రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ,"గత 20 సంవత్సరాలుగా కుటుంబాలకు దూరంగా గ్రామాల్లోనే ఉంటూ ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నాం.అయితే రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో పిల్లల విద్యా ఫీజులు,ఇంటి ఖర్చులు,ఇతర నిత్యావసరాలు కూడా నిర్వహించడం కష్టంగా మారింది"అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను విడుదల చేయడంతో పాటు,ఇకపై ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.అలాగే "సమాన పనికి సమాన వేతనం"సూత్రాన్ని అమలు చేసి,అదే శాఖలో పనిచేస్తున్న ఐకేపీ ఉద్యోగులకు అమలు చేస్తున్న పే స్కేల్‌ను తమకూ వర్తింపజేసి తగిన వేతనాలు చెల్లించాలని కోరారు.తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు హెచ్చరించారు.

## జూరాలకు భారీ వరద

### -24 గేట్లు ఎత్తివేసిన అధికారులు

### -శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద



**నాగర్ కర్నూల్ : : జులై 31 (ప్రజా జ్యోతి)**

జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం పోటెత్తింది దీంతో ఎగువ నుంచి వస్తున్న ఇన్ ఫ్లో ఏకంగా 1,46,000 క్యూసెక్కులకు చేరడంతో అప్రమత్తమైన ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు యొక్క 24 గేట్లను ఎత్తివేసి దిగవకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలా శయానికి వరద నీటి ప్రవాహం నిరంతరంగా కొన సాగుతుందని అధికారులు వెల్లడించారు.

## బ్యాంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్




**కృష్ణా జులై 31 (ప్రజా జ్యోతి)**

నారాయణ పేట జిల్లా కృష్ణా మండలం లో ని బ్యాంకుల్లో భద్రతా ఏర్పాట్లు మరింత పటిష్ట చేయాలి,అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి,ఖాతాదారులు నగదు లావాదేవీల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలిప్రజల భద్రతే లక్ష్యంగా కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకును కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ శుక్రవారం పరిశీలించారు. బ్యాంకులో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సెక్యూరిటీ విధులు, నగదు లావాదేవీల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులకు నగదు లావాదేవీల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలు, నగదు దొంగతనాలు, మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ అవగాహన పోస్టర్లను బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై ఎస్.ఎం. నవీద్ మాట్లాడుతూ... బ్యాంకులకు వచ్చే ప్రజలు తమ ఖాతాలకు సంబంధించిన ఓటీపీలు, ఏటీఎం పిన్ నంబర్లు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అపరిచితుల సహాయం తీసుకుని నగదు డ్రా చేయడం, డిపాజిట్ చేయడం, ఏటీఎం వినియోగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు.అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లే సమయంలో సాధ్యమైనంత వరకు ఒంటరిగా వెళ్లకుండా కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. బ్యాంకు పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, అనుమానాస్పద వస్తువులు కనిపించిన వెంటనే బ్యాంకు సిబ్బంది లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.బ్యాంకు అధికారులు సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు పనిచేసేలా చూడడంతో పాటు, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే చోరీలు, మోసాలు, సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్సై పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్ ఐ తెలిపారు.

## మున్సిపల్ పాలనపై శిక్షణ



**నాగర్ కర్నూల్ : జూలై 31 – ప్రజా జ్యోతి**

హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ మున్సిపాలిటీ వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగర్కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్,వైస్ చైర్మన్ బాధం రమేష్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.ఈ శిక్షణలో కార్యక్రమంలో పట్టణాభివృద్ధి,పారదర్శక పాలన,పారిశుధ్యం,తా గునీరు,వీధిదీపాలు,మెరుగైన సేవల నిర్వహణ పై శిక్షణ పొందారు.

## రైతులు పంటల సాగు పై అవగాహన కలిగి ఉండాలి

### -ఎంపీడీవో చెన్నమ్మ

**నాగర్ కర్నూల్ : జులై 31 (ప్రజా జ్యోతి)**

రైతులు పంటల సాగు పై అవగాహన కలిగి ఉండాలని నాగర్ ర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ అన్నారు.శుక్రవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపిడిఓ చెన్నమ్మ ఆమె పాల్గొనిఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నీవో ప్రభావం ఉండడంతో రైతులు ఆరుతడి పంటల సాగు పై దృష్టి సారించాలని, జలసిరి పనులు,ఇంకుడు,గుంతలు పాము పౌండ్ల నిర్మాణం,పారిశుధ్యం, డ్రైడే నిర్వహణపై అవగాహన కల్పించి నీటి సంరక్షణ ప్రత్యామ్నాయ పంటల సాగుపైనే రైతులు దృష్టి పెట్టాలని సూపించారు.



## సీపీఎస్ రద్దు చేసి.. ఓ పి ఎస్ ను పునరుద్ధరించాలి

### పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి

**నర్వజులై 31 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా పి.ఆర్.టి.యు.టి.ఎస్ (పి ఆర్ టి యు టి ఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా నర్వ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సంఘం సభ్యత్వ నమోదును విజయవంతంగా చేయించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ఉపాధ్యాయుల అతి ప్రధాన సమస్య అయిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని సిపిఎస్ తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓ పి ఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సామాజిక భద్రతతతో ముడిపడి ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనితో పాటు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 6 డియర్నెస్ అలవెన్స్ డి ఎ లను వెంటనే విడుదల చేయాలని, కొత్త పీఆర్సీ (పిఆర్సి ని కాలయాపన చేయకుండా అమలు చేయాలని కోరారు. రాబోయే ఆగస్టు 31 లోపు ఈ ప్రధాన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో, జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి,నర్వ మండల పి ఆర్ టి యు అధ్యక్షుడు సూరం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జి. హరీష్, గౌరవ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు మల్లేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి,సదన్ రావ్, వెంకటేశ్వర్లు, నర్వ మండల ఎంఈఓ శ్రీ జి.రామ్ రెడ్డి గారు,పెద్ద కడుమూరు కాంప్లెక్స్ప్రధానోపాధ్యాయులు శ్రీమతి భాగ్యలక్ష్మి మేడం నర్వ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సునీత మేడం పాతర్చేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ కృష్ణయ్య , కేజీబీవీ ఎస్.ఓ శ్రీమతి శిరీష పి ఆర్ టి యు జిల్లా నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఉస్మాన్ మధుసూదన్ నరేష్,ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైద్య సేవల్లో రాజీ లేదు.. నిర్లక్ష్యానికి చెక్

**– ఖిల్లా ఘణపురం సీహెచ్‌సీలో వైద్యుల హాజరు రికార్డులపై సీరియస్**

**– నూతన అత్యాధునిక ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం**

వనపర్తి/ఖిల్లా ఘణపురం, జూలై 31 (ప్రజాజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. ఖిల్లా ఘణపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో శుక్రవారం నూతన అత్యాధునిక ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పరిశీలన సందర్భంగా హాజరు రిజిస్టర్లు, సేవల రికార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే.. కొందరు వైద్యులు విధులకు హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేసిన విషయాన్ని గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మోసం చేసేలా రికార్డులు నిర్వహించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఆసుపత్రులను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తోందని, అలాంటి సమయంలో కొందరు వైద్యులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోందన్నారు.



"ప్రజలకు సేవ చేయడానికే ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చింది. విధుల్లో నిర్లక్ష్యం, తప్పుడు హాజరు నమోదు, ప్రజల పట్ల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తే కఠిన చర్యలు తప్పవు. రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సౌకర్యాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా ప్రతి వైద్యుడు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఖిల్లా ఘణపురం--పెద్దమందడి మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత క్యామరాజు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన "ఆపరేషన్ ముస్కాన్

**-నెల రోజులలో 60 మంది చిన్నారులకు విముక్తి**

**-42 మంది బాలురు,18 మంది బాలికల రెస్క్యూ**

**-స్టేట్ హోమ్‌కు 8 మంది తరలింపు**

**-బాలకార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు**

**-అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు**



**నాగర్ కర్నూల్ : జులై 31 (ప్రజా జ్యోతి)**

ఆపరేషన్ ముస్కాన్ లో నెలరోజుల పాటు పాల్గొన్న వివిధ విభాగాల అధికారులను నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్ పై అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా జులై 1 నుండి 31 వరకు నిర్వహించిన "ఆపరేషన్ ముస్కాన్-శ××" కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నెల రోజుల పాటు కొనసాగిన ఈ ప్రత్యేక బృందాల తనిఖీల్లో వివిధ చోట్ల బాలకార్మికులుగా,అనాథలుగా ఉన్న 60 మంది చిన్నారులను రెస్క్యూ చేసినట్లు జిల్లా ఎస్పీ వెల్లడించారు. విడుదల చేసిన చిన్నారుల్లో 42 మంది బాలురు,18 మంది బాలికలున్నారు,వీరిలో 8 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులు ఉన్నారు.రెస్క్యూ చేసిన పిల్లల్లో 52 మంది తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ఇచ్చి సురక్షితంగా అప్ప గించగా,మిగిలిన 8 మంది చిన్నారులను పునరావాసం కోసం స్టేట్ హోమ్‌కు తరలించడం జరిగిందని బాల్యం అనేది చిన్నారులు ఆడుతూ, పాడుతూ చదువుకునే వయసని,వారిని పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు.చదువుకోవాల్సిన వయసులో పిల్లలతో పనులు చేయిస్తే సంబంధిత యజమానులుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్,డిసిఆర్బి ఎస్ఐ రమేష్ ,ఎస్బిఐ రామ్ లాల్,ఎస్సై ఇందిరమ్మ, ఏఎస్ఐ విజయ లక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ సంబంధించినవివిధ విభాగాల అధికారులు పోలీస్ సిబ్బందిపాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

**మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి ఆదేశాల మేరకు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్ లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని 18 పాఠశాలలకు చెందిన 147 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు కడ్తాల్ మండలం అన్నాస్‌పల్లి గ్రామంలోని ఎర్త్ సెంటర్ ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీటి సంరక్షణ, నేల పరిరక్షణ, కంపోస్ట్ పిట్ తయారీ, వర్మీ కంపోస్ట్ తయారీ వంటి పర్యావరణహిత అంశాలపై ప్రత్యక్ష శిక్షణ అందించారు. అలాగే ఔషధ మొక్కల ప్రాముఖ్యతను వివరించి, వాటిని పాఠశాలల్లో పెంపొందించేలా అవగాహన కల్పించారు. జిల్లా సైన్స్ అధికారి శంశీర్ మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యత పెంపొందడంతో పాటు, వారు నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల్లో అమలు చేసి ఇతర విద్యార్థులకు సైతం ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు




లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీల లక్ష్మారెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వెంకటరెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ ఉపేందర్ రెడ్డి, పుడమి పత్రిక ఎడిటర్ రమేష్ రావు, జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.

## ఎస్సీ వర్గీకరణపై పోరాటం కొనసాగిస్తాం


**-- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. రత్నాకర్**

మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ): ఎస్సీ వర్గీకరణ వల్ల మాల సామాజిక వర్గం తీవ్రంగా నష్టపోయిందని, పార్లమెంట్‌లో చట్టపరమైన మార్పులు జరిగే వరకు శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాన్ని కొనసాగిస్తామని మాల మహానాడు, రాక్స్ జాతీయ అధ్యక్షుడు డా. ఆర్.ఎస్. రత్నాకర్ తెలిపారు.శుక్రవారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసే రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా అమలవుతున్న వర్గీకరణ విధానం సామాజిక న్యాయం పేరుతో ముందుకు తీసుకొస్తున్నప్పటికీ, అది మాల సామాజిక వర్గం ఉనికిని దెబ్బతీసే విధంగా మారిందని అన్నారు. రిజర్వేషన్ల ద్వారా లభించే అవకాశాలను అనేక ఉపకులాల మధ్య విభజించడం వల్ల అసలు ప్రయోజనం తగ్గిపోతుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం అనేది కేవలం రిజర్వేషన్లకే పరిమితం కాకుండా, అధికారంలో భాగస్వామ్యం, మంత్రి పదవులు, ప్రభుత్వ అవకాశాలు, దేశ సంపద పంపిణీలోనూ ప్రతిబింబించాలని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గ ప్రజాప్రతినిధులు ఈ అంశంపై బహిరంగంగా స్పందించకపోవడం బాధాకరమని పేర్కొంటూ, ప్రజాస్వామ్య పద్ధతుల్లో శాంతియుత ఉద్యమానికి మాల సామాజిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీరం సతీష్ కుమార్, తలారి రాజన్న, ఎడ్ల కృష్ణయ్య, కానుగడ్డ యాదయ్య, కాశయ్య, భైరంపల్లి నారాయణ, బోగరి విజయ్ కుమార్, అనిమల్ల నరహరి, నానీ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.




## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

నాగర్ కర్నూల్ : జులై 31 – ప్రజా జ్యోతి నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన చారగొండ ఏ ఎస్సై ఏ.గోపాల్,హెడ్ కానిస్టేబుల్ మహమ్మద్ పాషా శుక్రవారం పదవి విరమణపొందారు.ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల భద్రతకోసం సంవత్సరాల పాటు నీతి నిజాయితీ, క్రమశిక్షణ,అంకితభావంతో పోలీస్ శాఖలో వారు అందించిన సేవలు చిరస్మరణీయమైనవి,జీవితంలో సాధించిన విజయాలు,సంపాదించిన గౌరవం, ప్రజల అభిమానమే వారి సేవలకు నిదర్శనమని పదవీ విరమణ అనేది సేవలకు ముగింపు మాత్రమే కానీ జీవితానికి కాదని,ఇకపై మీరు కుటుంబ సభ్యులతో ఆనందంగా,ఆరోగ్యంగా,సుఖసంతో షాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కల్వకుర్తి డిఎస్పి సాయి వెంకట్ రెడ్డి,అచ్చంపేట డిఎస్పి శ్రీనివాసులు,సిఐ శంకర్ ,ఎవో కృష్ణయ్య,నాగర్ కర్నూల్ పోలీస్ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడుఏఎస్ఐ గోవర్ధన్ కుటుంబ సభ్యులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గూడెంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహణ

**చిన్నంబావి, జూలై 31 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలోని గూడెం గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ సెక్రెటరీ విక్రమ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి మురికి కాలువలు, వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలు, రహదారుల ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.ఈ సందర్భంగా గ్రామస్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో డ్రమ్ములు, నీటి పాత్రలు, పాత టైర్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రతను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతమ్మ, ఆశా కార్యకర్తలు యశోదాబాయి, రామచంద్రమ్మ, పారిశుద్ధ్య కార్మికులు లక్ష్మి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.



# 37 ఏళ్ల ప్రజాసేవకు ఘన వీడ్కోలు...

**-జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్‌కు ఆత్మీయ సన్మానం**
**- కలెక్టర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా ఘన సత్కారం... సేవలను కొనియాడిన జిల్లా అధికారులు**



**మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) కె. రవీందర్ పదవీ విరమణ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా రవీందర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలో 37 సంవత్సరాలు పూర్తి చేసి ప్రజాసేవకు జీవితంలోని అత్యంత విలువైన కాలాన్ని అంకితం చేయడం గొప్ప విషయమన్నారు. ఒక ఉద్యోగి విజయవంతమైన సేవల వెనుక కుటుంబ సభ్యుల సహకారం ఎంతో కీలకమని పేర్కొంటూ, రవీందర్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా రవీందర్ అత్యంత నిబద్ధతతో పనిచేశారని, జిల్లా అభివృద్ధికి అవసరమైన సమాచారాన్ని తక్కువ సమయంలో సమగ్రంగా సిద్ధం చేసి అందించడంలో ఆయన, ఆయన బృందం విశేష కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించిన వివిధ శాఖల సమాచారాన్ని సమన్వయం చేసి అందుబాటులో ఉంచడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా సమయాన్ని గడుపుతూ, శారీరకంగా, మానసికంగా చురుకుగా ఉండేలా ఏదైనా సృజనాత్మక కార్యకలాపంలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.
స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, నిధుల వినియోగం, ఎమ్మెల్యే, ఎంపీ నిధుల సమన్వయంలో ప్రణాళిక శాఖ కీలక పాత్ర పోషిస్తోందని, ఆ శాఖకు రవీందర్ సమర్థ నాయకత్వం వహించి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మాట్లాడుతూ, ప్రణాళిక శాఖకు రవీందర్ అందించిన విశిష్ట సేవలను ప్రశంసించారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ప్రణాళిక శాఖ సిబ్బంది, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు రవీందర్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి సీపీఓ నర్సింహులు, డీపీఆర్వో పి. శ్రీనివాస్, టీజీఓ అధ్యక్షుడు విజయ్, ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల సీపీఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని రవీందర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

## 37 ఏళ్ల సేవకు ఘన సత్కారం...




**మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ దరావత్ జానకి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సేవా కాలంలో వారి అంకితభావం, క్రమశిక్షణ, ప్రజల భద్రత కోసం చేసిన కృషిని కొనియాడుతూ శాలువా కప్పి జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు. పదవీ విరమణ పొందిన వారిలో మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ-2 భూపాల్ రెడ్డి (37 ఏళ్ల సేవ), వి.ఆర్. ఎస్‌ఐ సుదర్శన్ రెడ్డి (37 ఏళ్ల సేవ), మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీనివాసులు (35 ఏళ్ల సేవ), మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పీసీ-563 ప్రభాకర్ (35 ఏళ్ల సేవ) ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని పేర్కొన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశాలు జీవితాంతం ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణా రెడ్డి, ఏఓ రుక్మిణి భాయ్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్‌ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్‌ఐ హెచ్‌జీస్ అశోక్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్లు మధు, అశోక్ శెట్టి, బాల్‌రాజ్, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో ఆగస్టు నెలంతా పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలు

**- అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలకు నో... నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ జానకి**

మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ):
మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 2026 ఆగస్టు 1 నుంచి 31 వరకు పోలీస్ యాక్ట్ సెక్షన్--30 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రకటించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో, సెక్షన్--30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం, వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలను రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని ఎస్పీ సూచించారు. జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.




## విద్యార్థుల భవిష్యత్‌కు నైపుణ్యాలే బలమైన పునాది

**-గద్వాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టిఏఎస్ కే ఓరియంటేషన్ కార్యక్రమం**

గద్వాల (ప్రజా జ్యోతి) జూలై 31:మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,గద్వాలలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.కలందర్ బాషా అధ్యక్షతన తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ టి ఎస్ కే సి ఆధ్వర్యంలో టీఎస్ కే ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.కలందర్ బాషా మాట్లాడుతూ,విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఉద్యోగ నైపుణ్యాలను కూడాపెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.టీఏఎస్కే ద్వారా ఉద్యోగ నైపుణ్య శిక్షణలు,వ్యక్తిత్వ వికాసం కమ్యూనికేషన్ స్కిల్స్,ఇంటర్వ్యూ నైపుణ్యాలు వంటి అంశాల్లో నాణ్యమైన శిక్షణఅందించబడుతుందని తెలిపారు.ప్రతి విద్యార్థి టీఏఎస్కే లో నమోదు చేసుకొనిఅందుబాటులో ఉన్న శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
టి ఏ ఎస్ కే రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ,భవిష్యత్తులోపోటీపరీక్షలు,క్యాంపస్నియామకాలు మరియు ఉద్యోగ అవకాశాల్లో విజయాలుసాధించాలంటే నైపుణ్యాభివృద్ధి ఎంతో కీలకమని పేర్కొన్నారు. కెరీర్ ప్రణాళిక,వ్యక్తిత్వ వికాసం కమ్యూనికేషన్ స్కిల్స్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు సిటి ఎస్ కే సి అందించే శిక్షణలు విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలోకీలకపాత్రపోషిస్తాయనివివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్,టీఎస్ కేసి సమన్వయకర్త డాక్టర్ డి.సత్యమ్మ, సురేందర్ రెడ్డి,టీఎస్ కేసి మెంటార్ ఎం.సుబ్రమణ్యం, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.




## గురుకుల విద్యార్థినుల వసతులపై జాయింట్ కలెక్టర్ పరిశీలన

**మహమ్మదాబాద్, జూలై 31 (ప్రజా జ్యోతి):**
మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల గురుకుల పాఠశాలను మహబూబ్‌నగర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, హాస్టల్ వసతులను తనిఖీ చేసి నిర్వహణ తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. చదువు, భోజనం, తాగునీరు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ అందుతున్న సేవలపై ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థినుల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీలో గ్రామ సర్పంచ్ గాయత్రి దేవి, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.



# రైతులకు ప్రభుత్వ రాయితీలు అందేలా చర్యలు

**-- ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, కూరగాయల సాగు, ఆయిల్ పామ్‌పై విస్తృత అవగాహన కల్పించాలి**
**-- వ్యవసాయ, ఉద్యాన శాఖల పనితీరుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్ష**




**నాగర్ కర్నూల్ జులై 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
నాగర్‌కర్నూల్ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అనే అంశంపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శుక్రవారం సాయంత్రం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు, సబ్సిడీల పంపిణీ, పంటల విస్తరణ, అవగాహన కార్యక్రమాలు, రైతుల సమస్యలు తదితర అంశాలపై శాఖల వారీగా మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం అర్హులైన రైతులకు సకాలంలో చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. రైతులు ప్రభుత్వ పథకాలపై సరైన సమాచారం లేక నష్టపోయే పరిస్థితి తలెత్తకుండా గ్రామస్థాయిలోనే విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి ఏ.ఈ.ఓ తమ క్లస్టర్ లోని రైతులు 100 ఎకరాల్లో కూరగాయలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.కూరగాయల సాగు చేస్తే రైతులకు ఒక ఎకరానికి 3000 రూపాయల నుండి 5000 రూపాయల వరకు రాయితీ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న వివిధ రకాల రాయితీలు, సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలు పారదర్శకంగా అర్హులైన రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సూచనలు, వ్యవసాయ సలహాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.ముఖ్యంగా ఉద్యాన పంటల సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, కూరగాయల సాగు ద్వారా రైతులు తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నందున ఉద్యాన శాఖ అధికారులు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న సబ్సిడీలు, డ్రిప్ ఇరిగేషన్, మొక్కల పంపిణీ, ఇతర ప్రోత్సాహకాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

అదేవిధంగా ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రత్యేకంగాప్రోత్సహిస్తోందని, ఈ పంట సాగు వల్ల రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మొక్కల పంపిణీ, నిర్వహణ విధానాలు, మార్కెటింగ్ సదుపాయాలపై రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్యాన శాఖ అధికారులకు సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

వ్యవసాయ, ఉద్యాన శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించాలని,ప్రతి మండలంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులతో నిరంతరం మమేకమై ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని చెప్పారు.

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రైతులు ప్రభుత్వంపై నమ్మకం పెంచుకునేలా పారదర్శకంగా సేవలు అందించాలని, అర్హులైన ఒక్క రైతు కూడా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, హార్టికల్చర్ అధికారి వెంకటేశం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## నాలుగు దశాబ్దాల పోలీసు సేవకు ఘన సన్మానం

**గద్వాల,జూలై 31(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
సమాజ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నాలుగు దశాబ్దాల పాటు అంకితభావంతో పోలీసు శాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ ఎస్సై టి. ఆంజనేయులకు జోగుళాంబ గద్వాల్ జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,పోలీసు ఉద్యోగం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని,ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసే బాధ్యత అని అన్నారు.పోలీసులు తమ కుటుంబం కంటే సమాజ శ్రేయస్సుకే అధిక ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు.టి.ఆంజనేయులు దాదాపు 40 సంవత్సరాల పోలీసు సేవలో ఏడు సంవత్సరాల పాటు జోగుళాంబ గద్వాల్ జిల్లాలో విధులు నిర్వహించారని,2019లో ఏఆర్ ఎస్సైగా పదోన్నతి పొంది జిల్లాకు వచ్చారని తెలిపారు.తన సుదీర్ఘ సేవా కాలంలో ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలు లేకుండా ఉన్నతాధికారుల ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విధులు నిర్వహించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ శాంతి భద్రతల పరిరక్షణకు విశేష సేవలందించిన ఆంజనేయులు వంటి అధికారులు యువ పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తారని ఎస్పీ అన్నారు.వారి విజయాల వెనుక కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని ప్రశంసించారు.ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని,ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.నిత్యం యోగా లేదా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని,పిల్లలకు క్రమశిక్షణతో మార్గనిర్దేశం చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఉద్యోగ విరమణ పొందినప్పటికీ పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఉద్యోగ విరమణ పొందిన టి. ఆంజనేయులు మాట్లాడుతూ,తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర అధికారులు,సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్,ఏఆర్ డీఎస్పీ నరేందర్ రావు,కార్యాలయ ఏఓ పి.సాయి కృష్ణ,పోలీసు సిబ్బంది,ఉద్యోగ విరమణ పొందిన అధికారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## రికార్డులను ట్యాంపరింగ్ చేసిన అసలు దోషులను ఎందుకు శిక్షించడం లేదు?

**కోప్పునూర్ గ్రామానికి చెందిన 116.ఎకరాల భూమిని కాపాడుకుందాం**
**ప్రజల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి**
**ఆగస్టు 4న భారీ అఖిలపక్ష బహిరంగ సభ..**
**ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**

**చిన్నంబావి, జూలై 31 (ప్రజాజ్యోతి)**
కొప్పునూర్ గ్రామ శివారులోని 116 ఎకరాల 10 గుంటల గ్రామ ఉమ్మడి భూమిపై ప్రభుత్వం జారీ చేసిన 99 జీవోపై అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఒక్కతాటిపైకి వచ్చాయి. గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్తిని ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగబద్ధమైన హక్కులకు విరుద్ధమని తీవ్రంగా మండిపడ్డాయి. చిన్నంబావి మండల కేంద్రంలోని సునీత ఫంక్షన్ హాల్‌లో రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఉద్యమ కార్యాచరణకు నాంది పలికింది.ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, గ్రామ పూర్వీకులు ఇంటింటి నుంచి చందాలు సేకరించి కొనుగోలు చేసిన ఈ భూమి గ్రామ ప్రజల సమిష్టి ఆస్తి అని, దశాబ్దాలుగా పశువుల గొర్రెలు మేకల మేత కోసం, గ్రామ అవసరాలు, పేద ప్రజల ప్రయోజనాలు, భావితరాల సంక్షేమం కోసం ఈ భూమిని వినియోగిస్తున్నామని తెలిపారు. అలాంటి భూమిని గ్రామ ప్రజలతో ఎలాంటి చర్చలు జరపకుండా 99 జీవో ద్వారా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం ప్రజల హక్కులపై ప్రత్యక్ష దాడి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం గ్రామ ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, గ్రామ ఉమ్మడి భూమిని ఇండస్ట్రియల్ ఏరియాగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల జీవనాధారమైన భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలను సహించబోమని స్పష్టం చేశారు. రికార్డులను ట్యాంపరింగ్ చేసిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా, వారి ప్రయోజనాల కోసమే 99 జీవోను తీసుకొచ్చారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో రైతు కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులపై అనేక కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పిన ప్రభుత్వం, అసలు రికార్డులను తారుమారు చేసిన వారిపై మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఈ వ్యవహారంపై న్యాయపరమైన, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, 99 జీవోను వెంటనే ఉపసంహరించుకుని గ్రామ ఉమ్మడి భూమిని గ్రామ ప్రజల ఆధీనంలోనే కొనసాగించాలని, అలాగే 98 జీవోను పూర్తిస్థాయిలో అమలు చేసి శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు దశాబ్దాలుగా నిర్వాసితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను పరిష్కరించకుండా కొత్త వివాదాలకు ప్రభుత్వం తెరలేపడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.గ్రామ హక్కుల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చిన నాయకులు, ఆగస్టు 4న కొప్పునూర్ గ్రామ శివారులోని 116 ఎకరాల భూమి వద్ద భారీ అఖిలపక్ష బహిరంగ సభ నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల, నియోజకవర్గ, జిల్లా, స్థాయి అఖిలపక్ష నాయకులు, రైతులు, యువత, మహిళలు, ప్రజా సంఘాలు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ హక్కుల పరిరక్షణకు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం అప్పటిలోగా 99 జీవోను ఉపసంహరించుకోకపోతే చట్టబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని, గ్రామ ప్రజల హక్కుల కోసం ఎంతదూరమైనా పోరాటం కొనసాగిస్తామని అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొబునూరు గ్రామ రైతు కమిటీ సభ్యులు నిరంజన్ రెడ్డి మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ,,మాజీ జెడ్పీటీసీ కేశిరెడ్డి వెంకటరమణ, బీఆర్ఎస్ నాయకుడు కేశిరెడ్డి చిన్నారెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు కురువ చిన్న మల్లయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గారి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, సీపీఐ నాయకుడు మద్దూరు వెంకటేష్, బీజేపీ నాయకుడు చెన్నయ్య, సర్పంచులు వెంకటరెడ్డి, మద్దూరి శంకర్, అలాగే మహేశ్వర్ రెడ్డి, కురువ చిన్న మల్లయ్య, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, ఆనంద్, రామకృష్ణ, శ్రీరాములు, రమేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.






# మత్తుకు దూరంగా... ఆరోగ్యకరమైన జీవనానికి చేరువగా

### - మహబూబ్‌నగర్‌లో ఘనంగా "నశా ముక్త్ భారత్ అభియాన్" జిల్లా స్థాయి పోటీలు
### - విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు -- యువతకు మత్తు వ్యసనాలపై అవగాహన



మహబూబ్‌నగర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు ఛ క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నశా ముక్త్ భారత్ అభియాన్ మరియు మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి నశా ముక్త్ భారత్ పోటీలు ఘనంగా నిర్వహించారు.
విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో నుక్కడ్ నాటకం, పాటల పోటీలు, వ్యాసరచన, పోస్టర్ తయారీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా, జిల్లాలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) మరియు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మోటివేషన్ స్పీకర్ డాక్టర్ రెబ్బ శ్రీనాథ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. యువత తమ జీవిత లక్ష్యాలపై దృష్టి సారించి మత్తు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ఎం. మధు శ్రీ, మార్కండేయ, కలమ్మ, వసంత్, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు రాజేందర్ గౌడ్, అనిల్ కుమార్ గౌడ్, రాజేష్ తదితరులు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా యువజన అధికారి వి. కోట నాయక్ మాట్లాడుతూ, యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో "నశా ముక్త్ భారత్" ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నుక్కడ్ నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మత్తు వ్యసనాల వల్ల వ్యక్తి, కుటుంబం, సమాజంపై కలిగే దుష్పరిణామాలను హృదయానికి హత్తుకునేలా ప్రదర్శిస్తూ, మత్తు రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుండాలని సందేశాన్ని అందించారు.

# మద్దూర్‌లో పోలీసు మౌలిక వసతుల అభివృద్ధిపై ఉన్నతస్థాయి సమీక్ష

**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జూలై 31:**



మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సదుపాయాల అభివృద్ధి, గుండుమల్ మరియు కొత్తపల్లి నూతన పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై కడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.తిరుపతిరెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు. మద్దూర్ కేంద్రంగా మూడు పోలీస్ స్టేషన్లలో అవసరమైన సౌకర్యాల ఏర్పాటు, భవనాల నిర్మాణం,సిబ్బంది అవసరాలు, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం మద్దూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత భవనాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు.పోలీసు శాఖలో ఎస్సై,కానిస్టేబుల్ నియామకాల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఉచితంగా చదువుకునేందుకు లైబ్రరీతో పాటు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్, రోజువారీ వార్తాపత్రికలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆకాంక్షించారు.

# ఆసుపత్రుల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

### జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు
### - బూత్పూర్ పీహెచ్‌సీలో శానిటేషన్ డ్రైవ్

**బూత్పూర్, జూలై 31( ప్రజా జ్యోతి బ్యూరో ):**
రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శుక్రవారం జిల్లా వైద్యాధికారి డా. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణ, వార్డులు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు మెరుగైన సేవలు అందడంతో పాటు అంటువ్యాధుల నివారణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది పరిశుభ్రత ప్రమాణాలను నిరంతరం పాటిస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డా. రాజు, డా. అబ్దుల్ రబ్, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు, సుభాష్ చంద్రతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.
20



## అనారోగ్య బాధితురాలికి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్



**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూలై 31:**
జోగులంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన అడ్డాకుల అనురాధమ్మకు లివర్, కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అలంపూర్ మాజీఎమ్మెల్యే,ఏఐసీసీ కార్యదర్శి డా.ఎస్.ఏ. సంపత్ కుమార్ ప్రభుత్వంతో చర్చించి రూ.2.50 లక్షల విలువైన ఎల్‌ఓసీ ఎల్ ఓసి పత్రాన్ని అందజేశారు.అలాగే నిమ్స్ వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ జనరల్ సెక్రటరీ అడ్డాకుల భాస్కర్,రాజరత్నం, యువరాజు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 51 కిలోల కూరగాయలతో శాకంబరి అలంకరణ



**మల్దకల్,జూలై 31(ప్రజా జ్యోతి):**
మల్దకల్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి 51 కిలోల కూరగాయలతో శాకంబరి అలంకరణను వైభవంగా నిర్వహించారు.ఈ అలంకరణను నరహరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అలంకరణకు అవసరమైన కూరగా యలన్ని ఒటినీ దేవాలయం తరఫున సమ కూర్చినట్లు ఆర్యవైశ్య నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా శాకంబరి అలంకరణను శ్రద్ధగా నిర్వహించిన నరహరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అలాగే ఆర్యవైశ్య సంఘానికి చెందిన కుటుంబాలు తమ ఇళ్ల నుంచి వివిధ రకాల కూరగాయలతో తయారు చేసిన దండలను తీసుకొచ్చి కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆర్యవైశ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఏ.విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**నారాయణపేట జిల్లా మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి జులై31:**
మద్దూర్ పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్సై ఏ. విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై శ్రీనివాసులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ కావడంతో,వారి స్థానంలో విజయ్ కుమార్ నియమితులయ్యారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై ఏ.విజయ్ కుమార్ మాట్లాడుతూ,మండల ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రజలు పోలీసు శాఖకు సహకరించి శాంతియుత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.